క్లుప్తంగా

పరామర్శ

రేణిగుంట: వైఎస్సార్ సీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు వి. ప్రభాకర్ తండ్రి వి.గురవయ్య(80) ఇటీవల మృతి చెందడంతో సోమవారం ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.సంధ్య, మండల పార్టీ అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, ఎంపీటీసీ అనందరావు పాల్గొన్నారు.

తాగునీటి బోరు మోటారుకు మరమ్మతులు



బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పీవీకండ్రిగ గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరు మోటారుకు సోమవారం సర్పంచ్ కోటమ్మ, మండల వైఎస్సార్‌సీపీ వడ్డెర సంఘం కన్వీనరు ప్రసాద్‌పాల్ కూలీలతో మరమ్మతులు చేయించారు. వారు మాట్లాడుతూ బోరు మోటారు మరమ్మతులకు గురైన వెంటనే తాగునీటికి గ్రామస్తులు ఇబ్బంది పడకూడదని మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. పంచాయతీలో నిధులు లేనప్పటికి తాగునీటికి ఇబ్బంది పడకూడదని, సొంత నిధులతో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల తనిఖీ



ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఆర్ఐ జయకృష్ణ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆదేశాలను సోమవారం రేణిగుంట కుక్ర మంగళం, తండ్లం పంచాయతీలలో రేణిగుంట ఆర్ఐ జయకృష్ణ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇసుక ట్రాక్టర్లను ఆపి ఇసుక ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ ఉందా, లేదా? అని పరిశీలించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వీఆర్వోలు శ్రీధర్, రామ్ చరణ్ తేజ్ పాల్గొన్నారు.

ఏర్పేడులో వాహనాలు..

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడులో సోమవారం సాయంత్రం సీఐ జయచంద్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన పలు కార్లను ఆపి తనిఖీ చేశారు. రహదారి నియమావళిని అనుసరించి వాహనాలను నడపాలని, ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్లు ధరించాలన్నారు.

సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



నాగలాపురం: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కృష్ణాపురం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు కృష్ణాపురం పొలిమేర వద్ద వనమ్మ రాజ దంపతులు రోడ్డు పక్కనే రేకులు షెడ్ నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. సోమవారం తన భార్య వనమ్మకు ఆరోగ్యం సరిలేక నగరి ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. అయితే ఆ సమయంలో (రాత్రి 8.45 గంటలకు) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. వెంటనే సమాచారమందుకున్న సత్యవేడు అగ్నిమాపక సిబ్బందికి మంటలను అదుపుచేశారు. ఇంట్లో ఎవరూ లేనందున ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న వస్తువులు దుస్తులు, పూర్తిగా కాలి బూడిదవడంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టపోయినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

అంధకారం



రేణిగుంట–తిరుపతి మార్గంలోని ఫ్లైఓవర్‌పై లైట్లు మూడు రోజులుగా వెలగకపోవడంతో అంధకారం అలుముకుంటోంది. నిత్యం వందలాది వాహనాలు, వేలాదిమంది ప్రయాణికులు ప్రయాణించే ఈ ఫ్లైఓవర్ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలకు తావిచ్చేలా ఉంటోంది. రాత్రి సమయంలో రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా లైట్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. – శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

పొంచి ఉన్న ప్రమాదం





మండలంలోని కారణి గ్రామం వద్దనున్న కేటీ రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటం కోసం ఆరు నెలల క్రితం విద్యుత్‌శాఖ అధికారులు రెండు చోట్ల రోడ్డుపై స్తంభాలను దించారు. ఆరు నెలలుగా విద్యుత్ స్తంభాలు రోడ్డుపైనే ఉండడంతో రాత్రిళ్లు వాహనదారులకు స్తంభాలు కనబడకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. – బుచ్చినాయుడుకండ్రిగ

మైనర్.. డ్రైవింగ్ డేంజర్



రేణిగుంట మండలం కొట్రమంగళం సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక రవాణా చేసేందుకు ఓ ట్రాక్టర్‌లో కొందరు బాలలను మరో మైనర్ బాలుడు డ్రైవింగ్ చేస్తూ నదిలోకి వెళ్లాడు. ఫొటోలు తీయడం గమనించిన ఆ బాలుడు తన మొహం కనపడకుండా పక్కకు తిప్పుకొని ట్రాక్టర్‌ను వేగంగా నడుపుకుంటూ వెళ్లాడు. ఆ వేగానికి ట్రాక్టర్ అదుపు తప్పి ఉంటే ప్రమాదం సంభవించి ఉండేది. తక్కువ జీతం ఇవ్వొచ్చనే ఉద్దేశంతో ట్రాక్టర్ యజమానులు బాలలను ఇలా పనుల్లో పెట్టుకుంటున్నారని స్థానికులు చెప్పారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది. –శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

పాఠశాలలో సామాజిక తనిఖీ గ్రామసభ

సత్యవేడు: స్థానిక జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. డీఆర్పీలు ఏసు, ఓబయ్య ఎస్ఆర్పీ వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామ సభ తనిఖీలు చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించిన తనిఖీలలో వెలుగులోకి వచ్చిన వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడినంతగా గదులు, ఆటస్థలం, డార్మిటరీ ఉందని తెలిపారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరు తనిఖీకి హాజరు కాలేదన్నారు. మరుగుదొడ్లు 13 నిరుపయోగంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నలుగురు విద్యార్థులు లేకపోయినా అంతర్జాల హాజరు పట్టికలో నమోదు చేశారన్నారు. ఆదివారం మెనూ ప్రకారం అందించాల్సిన చికెన్ బిర్యాని అందించలేదన్నారు. నెలలో 4రోజులు కోడిగుడ్లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రిన్సిపల్ సత్యనారాయణను వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని త్వరలో అన్ని సరిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రస్తుత ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఏటీపీ సురేష్, ఎస్ఎంఈ సభ్యులు మునికృష్ణయ్య, హారతి, లక్ష్మీ, కో ఆప్షన్ సభ్యుడు దినకరన్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల గ్రామసభలో వివరాలు తెలుపుతున్న డీఆర్పీ ఏసు

మద్యం సీసాలు, వ్యర్థాల దహనం

శ్రీకాళహస్తి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నరసింహామూర్తి హెచ్చరించారు. పట్టణంలోని నీలకంటేశ్వర స్వామి ఆలయ ప్రాంతంలో బహిరంగంగా కొందరు మద్యం సేవిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ, 1వ టౌన్ సీఐ గోపి సిబ్బందితో సోమవారం అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మద్యం సీసాలను, వ్యర్థాలను పోగేసి దహనం చేశారు.



మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్లను పోగు చేసిన పోలీసులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

రేణిగుంట(ఏర్పేడు): ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరించారు. మండలంలోని సీతారాంపేట సమీపంలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో మందుబాబులు మద్యం సేవిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు





జిల్లా కలెక్టర్, సూళ్లూరుపేట ఆర్డీఓ నుంచి ప్రశంసాపత్రాలందుకుంటున్న తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ శివకుమార్, డీటీ వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలు శాఖల అధికారులకు గణతంత్ర దినోత్సవం రోజున ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఆ మేరకు మండల తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ శివకుమార్, ఎఫ్ఎస్ఓ దేవరాజులు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, వీఆర్వో మధుసూదన్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరికి ఆయా శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సత్కారం

బుచ్చినాయుడుకండ్రిగ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న మండల ఎస్ఐ విశ్వనాథనాయుడును సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కార్తీక్, మునిచంద్రనాయుడు, రవి, గురవయ్య, వెంకటేశ్వర్లు, సిబ్బంది దుశాలువతో సత్కరించారు. ఆయన విధి నిర్వహణలో అందించిన ఉత్తమ సేవలను కొనియాడారు.

నైతిక విలువలతోనే గుర్తింపు

నారాయణవనం: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో, నైతిక విలువలను పాటిస్తే గుర్తింపును పొందుతారని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పాలమంగళం ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 8వ తరగతి నుంచే కౌమార దశ ప్రారంభవుతుందని అన్నారు. ఈ దశలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

స్కూలు అభివృద్ధికి సహకరించండి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సామాజిక తనిఖీలో భాగంగా విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఆర్పీ వెంకయ్య, డీఆర్పీలు రవిశంకర్, నాగరాజు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిక్ష పథకాలపై తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు అవసరాలపై సభలో చర్చించి నివేదిక తయారు చేశారు. స్కూలు అభివృద్ధికి సహకరించాలని వెంకయ్య కోరారు. హెచ్ఎం విష్ణువర్ధనం,టీచర్లు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి ట్యాంకు వితరణ



ట్యాంకు నుంచి కొళాయి నీటిని విడుదల చేస్తున్న దాత శరవణన్

వరదయ్యపాళెం: మండలంలోని చెన్నవారిపాళెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ శరవణ అదే పాఠశాలకు విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం సింథటిక్ ట్యాంకును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ట్యాంకును ప్రారంభించి కొళాయిల ద్వారా నీటిని విడుదల చేశారు. శరవణ కుటుంబ సభ్యులను ప్రధానోపాధ్యాయులు శశికుమార్ ఘనంగా సత్కరించారు.

సమాచార హక్కు చట్టానికి స్పందన లేదు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం పంచాయతీలో బాధ్యతగా వ్యవహరించాల్సిన పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆ పంచాయతీకి చెందిన డి.బాలకృష్ణ ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. పంచాయతీలో జరుగుతున్న అవకతవకలపై సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరితే ఏమాత్రం స్పందించడం లేదని ఆయన మీడియాకు వివరించారు. పంచాయతీ పరిధిలో 3 నెలలుగా విద్యుత్ సర్వీసుల కోసం ఇచ్చే ఎన్ఓసీలను అనధికారిక భవనాలకు ఇస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ఆయన తెలిపారు. అంతేకాక గిరిజన సర్పంచ్ మహిళకు కనీసం గౌరవం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు.

ఆలయం వద్ద చెట్ల నరికివేత

నాగలాపురం: స్థానిక ధర్మరాజు ఆలయం వద్ద మహావృక్షాలను నరికేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖాధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం మేరకు, ధర్మరాజుల ఆలయం వద్ద భక్తులతో పాటు, ప్రతి వారం జరుగుతున్న సంత వ్యాపారులకు నీడ నిచ్చే చెట్లను అధికార పార్టీకి చెందిన కొందరు అనుమతులు లేకుండా నరికివేశారు. వందల సంవత్సరాల నాటి వృక్షాలను నరికివేసి, పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవాలని అనుకుంటున్నారు. దీనిపై కొందరు ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి తాలుకా క్యాలెండర్లను సోమవారం ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీజీ తాలుకా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే తనిఖీ



భక్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆలయంలో పలు ప్రాంతాలను తనిఖీ చేసి ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం అన్నదాన కేంద్రంలో భక్తులతో మాట్లాడి భోజన నాణ్యత ఎలా ఉందో తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



నారాయణవనంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

నారాయణవనం: అంతర్జాతీయ ఎలక్ట్రీషియన్ డేను సోమవారం నారాయణవనంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఎలక్ట్రీషియన్లు ర్యాలీని నిర్వహించి, సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఎలక్ట్రీషియన్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ చేతి వృత్తిగా గుర్తించి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్లు గురుస్వామి, సేతు మాధవన్, హరి, ముని, బాల, రాజశేఖర్, వినోద్, జీవ, నేతాజీ, ఉరప్ప, వేనంటేష్, మూర్తు, కుమార్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరునికి ప్రత్యేక పూజలు

రేణిగుంట (ఏర్పేడు): పుష్యమాసం ఆఖరి సోమవారం సందర్భంగా ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పురాణ ప్రశస్తి కలిగిన శైవక్షేత్రం పరశురామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అభిషేక పూజలు చేసి స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

బాలుకు ప్రశంసాపత్రం

శ్రీకాళహస్తి: మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం అంతర్జాల వేదికగా విశిష్ట అభినందన ప్రశంసాపత్రం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన స్వేచ్ఛా స్వాతంత్ర్య అంశంపై నిర్వహించిన కవితల పోటీలకు ఈయన తన కవితను పంపారు. దీనికి ఆయనకు ప్రశంసాపత్రం లభించింది.

వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రాస్ చైల్డ్ ఫండ్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని గుత్తివారి పల్లె ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి మాట్లాడారు.కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ లతీష్ కుమార్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాయితేజ, ఉపాధ్యాయులు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

డైమండ్ జూబ్లీ జంబూరికి స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి: తమిళనాడులోని తిరుచునాపల్లి జిల్లా మనప్పరైలోని ఇండస్ట్రియల్ మైదానంలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు డైమండ్ జూబ్లీ జంబూరి(జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమ్మేళనం) నిర్వహించారు. దీనిలో పాల్గొనడానికి స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శరణ్‌ప్రసాద్, వెంకట మహేష్, రూపేష్, తేజ, శరవణ కుమార్ ఎంపికయ్యారు. డీఈవో కేవీఎస్‌కుమార్ ఆదేశాల మేరకు వారు సోమవారం బయల్దేరి వెళ్లారు. ఈ శిబిరంలో క్లిష్టమైన విన్యాసాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సర్వీస్ రోవర్‌గా మణికంఠ వ్యవహరిస్తారు. వీరికి జిల్లా స్కౌట్స్ కమిషనర్ ఎంఎంరెడ్డి, కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు శిక్షణ ఇచ్చారు.



ఎంపికైన స్కౌట్ విద్యార్థుల

పల్లికొండేశ్వర స్వామికి ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి సోమవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఓం నమశ్శివాయ అంటూ శివనామ స్మరణాలతో ఆలయాన్ని మారుమోగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పుజలు చేశారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదాలు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డైరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహణ అధికారి పి.లత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించరూ!

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని రేణిగుంట ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. బల్బును కనుగొన్న శాస్త్రవేత్త సర్ థామస్ ఆల్వా ఎడిసన్‌ను స్మరిస్తూ ప్రతి ఏటా జనవరి 27న ఎలక్ట్రీషన్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ, 1880 జనవరి 27న మొదటిగా బల్బును వెలిగించిన రోజు అని చెప్పారు. ఆరేళ్లగా ఇదేరోజున పండుగ వాతావరణంలో ఎలక్ట్రీషన్ డే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అయితే ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ కార్మికులకు బీమా ఇన్సూరెన్స్ వంటివి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. తిరుపతిలో జరిగే సభలో ప్రజా ప్రతినిధులు అధికారులకు తమ సమస్యలపై విన్నత పత్రం ఇస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్, కార్యదర్శి మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.



థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ట్రాఫిక్ నియంత్రణ సామగ్రి వితరణ

రేణిగుంట: జాతీయ రహదారి భద్రతా మాస వేడుకల్లో భాగంగా మండలంలోని కరకంబాడి అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం తిరుపతి ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన సామగ్రిని వితరణగా అందజేసింది. హెల్మెట్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, 3ఎం డస్ట్ రెస్పిరేటర్లు, బారికేడ్ టేపులు, సేఫ్టీ గాగుల్స్ మొదలైన వాటిని అమరరాజా హెచ్ఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ నళిని కుమార్, సేఫ్టీ హెడ్ వెంకటకృష్ణ తదితరులు తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ ఆచారికి అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి ట్రాఫిక్ సీఐ సంజీవ కుమార్, ఎస్సైలు విజయలక్ష్మి, బాలాజీ పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణ సామగ్రిని అందజేస్తున్న అమరరాజ కంపెనీ ప్రతినిధులు